క్లుప్తంగా

ముత్యాలమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం పొంగళ్లు పెట్టారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రావి చెట్టు, త్రిశూలం వద్ద పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించారు.

సతుకుమాటి ఇంట విషాదం


మృతి చెందిన అఖిల్‌రెడ్డి(ఫైల్)

చిల్లకూరు : తీర ప్రాంతంలోని ఏరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సతుకుమాటి సుధీర్‌రెడ్డి ఇంట ఆదివారం విషాదం నెలకొంది. సుధీర్ రెడ్డి కొడుకు అఖిల్‌రెడ్డి(21) బీబీఏ చదివాడు. విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఇందులో భాగంగా అక్కడ చేపట్టే ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావడానికి చదువు మీద దృష్టి పెట్టాడు. రెండు రోజులుగా విరేచనాలు అవుతున్నా కుటుంబ సభ్యులకు చెప్పలేదు. దీంతో పూర్తిగా నీరసించిన యువకుడిని శనివారం రాత్రి కుటుంబ సభ్యులు గమనించి సపర్యలు చేసి నెల్లూరులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు హఠాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. సుధీర్‌రెడ్డిని పలువురు పరామర్శించి ధైర్యం చెప్పారు.

రెండు బోర్ల ఏర్పాటు


బోర్లు వేయిస్తున్న మున్సిపల్ అధికారులు

గూడూరు రూరల్ : గూడూరు రెండవ పట్టణ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో నివసించే వారి తాగునీటి అవసరాలను తీర్చేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం రెండు బోర్ల తవ్వకాన్ని ప్రారంభించారు. టిడ్కో ఇళ్లలో నివసించే వారికి కండలేరు నుంచి వచ్చే నీటిని అందించేందుకు గతంలో ప్రణాళికలను సిద్ధం చేశారు. పట్టణంలోని వారికి పూర్తి స్థాయిలో నీటిని అందించలేక పోతుండడంతో టిడ్కో ఇళ్లలోని వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ వచ్చారు. వారికి పూర్తిగా నీరు అందక క్యాన్లను కొనగోలు చేసుకోవాల్సి వస్తోంది. ఎన్నికల కోడ్ ఉండడంతో అక్కడ ఎలాంటి పనులు చేపట్టలేక పోయారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో మున్సిపల్ అధికారులు రెండు బోర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు.

డీవీ సత్రంలో ఉచిత కంటి పరీక్షలు


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం సూళ్లూరుపేట రోటరీ క్లబ్, కోగిలి జాయరామిరెడ్డి సేవా సమితి సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. 150 మంది దృష్టిలోపం ఉన్న వారికి పరీక్షలు చేసి 70 మందిని శస్త్ర చికిత్స కోసం రేఫర్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు, సభ్యులు దశరథరెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, శివకుమార్‌రెడ్డి, డాక్టర్లు సాయిబాబా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూలై 1న మహా విష్ణువు ఆలయ వార్షికోత్సవం


రాపూరులోని అయ్యప్పస్వామి ఆలయం

రాపూరు: మండల కేంద్రమైన రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్దనున్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల తృతీయ వార్షికోత్సవాన్ని జూలై 1న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి ఉదయం 5 గంటలకు అభిషేకం, 6 గంటలకు పూలంగి సేవ, 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువుకు కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు, అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆదర్శంగా నిలుస్తున్న కట్టడాలు


చెక్కు చెదరని అశోక్ స్తంభం

వాకాడు : కొంతమంది నాయకులు నిర్మించే కట్టడాలు వారి సేవా నిరతిని, ప్రజలపై వారికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తాయి. ఆ కోవకు చెందిన నాయకులు హరిజన విద్యార్థి ఉద్ధారక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. వారు తమ స్వగ్రామం వాకాడులో చేపట్టిన నిర్మాణాలు రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి. నేటికి అవి నిర్మించి 60 ఏళ్లు దాటినా చెక్కుచెదరకుండా ఆకట్టుకుంటున్నాయి. వాకాడు గ్రామం ముఖ ద్వారంలో నిర్మించిన కీర్తి తోరణం (ఆర్చ్)ను ఆ గ్రామ సర్పంచి కాటంరెడ్డి రామలింగారెడ్డి 1961లో నిర్మించారు. దాని ప్రారంభోత్సవానికి అప్పటి ముఖ్యమంత్రి దామోధర సంజీవయ్యను తీసుకువచ్చి దళితులపై తమకున్న ప్రేమను నేదురుమల్లి కుటుంబీకులు చాటుకున్నారు. ఈ కీర్తి తోరణం వాకాడు ప్రాంతానికే వన్నె తెచ్చింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోనూ ఆదర్శంగా నిలిచింది. అదేవిధంగా వాకాడు స్వర్ణముఖి నది సమీపంలో దాదాపు 50 అడుగుల ఎత్తులో మూడు సింహాలు కలిగిన అశోక స్తంభం నిర్మాణాన్ని హరిజన విద్యార్థి ఉద్ధారక సంఘం సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ అశోక స్థూపాన్ని 1963లో అప్పటి రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి, జిల్లాకు చెందిన దివంగత నేత ఏసీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. వాకాడులోని విద్యా సంస్థల ఆవరణలోని దాదాపు 28 అడుగుల ఎత్తులో స్వామి వివేకానంద విగ్రహాన్ని నిర్మించారు. ఈ విగ్రహాన్ని 1964లో నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి అప్పటి రెవెన్యూ మంత్రి ద్వారా ప్రారంభించారు. అలాగే వాకాడులోని బాలకృష్ణారెడ్డి సేవా క్షేత్రం ప్రాంగణంలో 1963లో నిర్మించిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని అప్పటి కేరళ రాష్ట్ర గవర్నర్ అయిన వీవీ గిరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కట్టడాల నిర్మాణాల విషయంలో దివంగత వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యుడు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి కృషి ఎంతో ఉంది. ఈ కట్టడాల నిర్మాణాల విషయంలో పద్మనాభరెడ్డి పినతండ్రి బాలకృష్ణారెడ్డికి చేదోడు వాదోడుగా ఉండే వారు. అందులో బాగంగానే నేదురుమల్లి పూర్వీకులు నిర్మించిన ఈ అపురూప కట్టడాలు దాదాపు 70 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ నేటికీ చెక్కు చెదరలేదు. ఈ కట్టడాలకు ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థల నిర్వాహకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అప్పుడప్పుడు కొత్త మెరుగులు దిద్దడంపై గ్రామస్తులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఊరిలోకి ప్రవేశించే ముందు అపురూప కట్టడమైన కీర్తి తోరణం(ఆర్చ్)


జీవంతో ఉట్టిపడుతున్న స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ విగ్రహాలు

ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి


శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

డక్కిలి: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం డక్కిలిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1901లో కోల్‌కతాలో జన్మించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ న్యాయవాదిగా, విశ్వవిద్యాలయం అధిపతిగా, జవహర్‌లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారని గుర్తు చేశారు. 1951లో జనసంఘ్ ఏర్పాటు చేసి పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణమనాయుడు, ఈత మొక్కల యోగేశ్వరరావు, గుండాలు, గోపాల్ నాయుడు, శంకర్‌నాయుడు, నాగేశ్వరరరావు, మునలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.365 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.365 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బుల్లెట్ దగ్ధం


మంటల్లో కాలి పోతున్న బుల్లెట్ వాహనం

గూడూరు: పట్టణంలో జనం రద్దీగా ఉండే ప్రాంతంలో ఆదివారం బుల్లెట్ దగ్ధమైంది. పట్టణంలోని కుమ్మరవీధిలో ఉన్న విశ్వ బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో వద్ద ఒక వ్యక్తి బుల్లెట్ వాహనం నిలిపి పక్కకు వెళ్లాడు. కొద్ది సేపటికి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. చూస్తుండగానే వాహనం పూర్తిగా కాలి పోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆదుపు చేశారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి చేయూత


నగదు అందజేస్తున్న దయాకర్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నది తీరం వద్ద ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు చేయూత అందిస్తున్నట్లు హిందూ ధర్మ సేవా సంఘం నాయకుడు పీడీ ఉదయశంకర్ తెలిపారు. పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి శ్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం ఆదివారం రూ.50 వేలు విరాళం ఇచ్చారు. తన తమ్ముడు సన్నారెడ్డి సురేష్ రెడ్డి జ్ఞాపకార్ధంగా నగదును అందించినట్లు దయాకర్ రెడ్డి తెలిపారు. హిందూ ధర్మ సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ అనేక మంది ప్రజా ప్రతినిధులతో పాటు దాతల చొరవతో పట్టణంలోని హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, హిందూ ధర్మ సేవా సంఘం సభ్యులు మునగాల కృష్ణారావు, ఎన్ కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చిల్లకూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మల్లయ్యగారిపాళెం గ్రామానికి చెందిన పారిచర్ల వెంకయ్య(28) ఈ నెల 17వ తేదీన గూడూరులో పనులు ముగించుకుని బైక్‌లో ఇంటికి బయలుదేరాడు. వరగలి క్రాస్ రోడ్డు దాటిన తర్వాత పోటుపాళెం జంక్షన్ వద్ద చింతవరం వైపు నుంచి గూడూరుకు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకయ్యను స్థానికులు నెల్లూరు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఐదు నెలల చిన్న బిడ్డ ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో ఎన్‌సీసీ శిక్షణా శిబిరం


అగ్నిప్రమాదాల నివారణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో 10వ ఆంధ్రనేవల్ యూనిట్ ఎన్‌సీసీ శిక్షణా శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. ఆదివారం నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో డ్రిల్, గన్ ఫైరింగ్, అగ్ని ప్రమాదాలపై శిక్షణ ఇచ్చారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను ఆర్పే విధానం, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించడంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ శిబిరంలో వివిధ జిల్లాల నుంచి 639 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నట్లు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు మల్లికార్జునరెడ్డి, గుండాల నరేంద్రబాబు, నాగరాజు, మస్తానయ్య పాల్గొన్నారు.

స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు




విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

అంగరంగ వైభవంగా రథోత్సవం

గూడూరు పట్టణంలోని బజారు వీధిలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి స్వామి వారికి కల్యాణం చేపట్టారు. ఆదివారం ఉదయం రథోత్సవం చేపట్టారు. స్వామి వారు, అమ్మవార్లతో కలిసి రథంపై కొలువుదీరారు. రథాన్ని లాగేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

- గూడూరు రూరల్


రథాన్ని లాగుతున్న భక్తులు

రోడ్డును కప్పేస్తున్న ముళ్లపొదలు


కడివేడు నుంచి బూదనం వెళ్లే రోడ్డులో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు


కడివేడు రోడ్డులో ఇరువైపులా పెరిగిన కంప చెట్లు

చిల్లకూరు : మండలంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వరగలి రహదారిపై చేడిమాల ప్రాంతంలో ముళ్లపొదలు ఇరు వైపులా ఏపుగా పెరిగి పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపించడం లేదు. అలాగే కడివేడు నుంచి బూదనం వెళ్లే రోడ్డులోనూ చెట్లు విపరీతంగా పెరిగాయి. దగ్గరికి వచ్చే వరకు ఎదురుగా వాహనం కనిపించకపోవడంతో గతంలో ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు మృత్యువాతపడ్డారు. కనీసం మలుపుల వద్దనైనా చెట్లు తొలగించాలని స్థానికులు పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు ఓపీలు రాస్తున్న వైద్య సిబ్బంది


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

డక్కిలి: మండల కేంద్రమైన డక్కిలి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి వెంకటేశ్వర అరవింద్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 160 మందికి పరీక్షలు చేసి 77 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీ శంకర్, సీఈవో సీతరామనాయుడు తెలిపారు. 35 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, 48 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. ట్రస్ట్ ఏవో కృష్ణా గల్లా, అరవింద్ ఆస్పత్రి సిబ్బంది జీవన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయునికి ఘన సన్మానం


సతీష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సాయికృష్ణయాచేంద్ర

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన అములూరు సతీష్ దంపతులను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి రాజా కుటుంబ సభ్యులు డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారని పేర్కొన్నారు. సర్వజ్ఞకుమార యాచేంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగ విరమణ సర్వ సాధారణమని, శేష జీవితం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, రామచంద్రమనాయుడు, ఉపాధ్యాయులు పి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తడలో విశ్రాంత హెచ్ఎంకు..

తడ: మండలంలోని కొండూరు పంచాయతీ సుందరపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో గంగాధర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, ఎంఈవోలు సరస్వతి, మల్లికార్జునరావు, ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, హజరత్, ప్రభాకర్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.


విశ్రాంత ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గిరిజన గురుకులంలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

గూడూరు రూరల్ : మండలంలోని చెన్నూరులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం మధ్యాహ్నం కలుషిత నీరు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీనిపై కలుషిత నీరు తాగి విద్యార్థులకు అస్వస్థత అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన చెన్నూరు ఆస్పత్రి వైద్యులు ఆదివారం గురుకులంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 150 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. గురుకులంలోనే ఉండి విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వెల్లడించారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం కలిచేడు గ్రామంలో స్థానిక టీడీపీ నేత టి.విజయ్‌కుమార్ నాయుడు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత ఎస్ఎస్ఆర్‌నాయుడు, మండల కన్వీనర్‌మోహన్‌కృష్ణారెడ్డి, మండల నేత సుబ్రమణ్యంరాజు, రాజశేఖర్‌రాజు, దిలీప్, పారిశ్రామికవేత్త పద్మమోహన్‌నాయుడు, రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.